క్లుప్తంగా

ఆస్పత్రిలో మంచాలు, వేస్ట్ వస్తువులకు టెండర్ల ఆహ్వానం

హిందూపురం టౌన్: ప్రభుత్వ ఆస్పత్రిలోని వేస్ట్, ఐరన్ మంచాలు, బెడ్ సైడ్ లోకర్స్, ఇతర వస్తువులను స్ట్రీమ్ లైనింగ్ ఆఫ్ డిస్ట్రిక్ట్ హాస్పిటల్ హిందూపురం ఫర్ బెటర్ సర్వీసెస్ కమిటీ ఆదేశాలతో టెండర్ల ద్వారా వేలం నిర్వహించనున్నట్లు సూపరింటెండెంట్ డాక్టర్ లింగన్న సోమవారం తెలిపారు. ఈ నెల 19వ వరకు టెండర్ల స్వీకరణ ఉంటుందని, 20న టెండర్లు తెరుస్తామని పేర్కొన్నారు. టెండర్ ఫాం, తదితర వివరాలు ఆస్పత్రిలోని కార్యాలయంలో పొందాలని సూచించారు.

గది బాడుగకు టెండర్ల ఆహ్వానం

హిందూపురం ప్రభుత్వ ఆస్పత్రి ఆవరణలోని ఒక గదిని బాడుగకు ఇవ్వడానికి టెండర్లు ఆహ్వానిస్తున్నట్లు సూపరింటెండెంట్ డాక్టర్ లింగన్న తెలిపారు. రూ.10వేల బాడుగతో రెండు సంవత్సరాల కాలానికి ప్రభుత్వం గుర్తించిన ఏజెన్సీల నుంచి సీల్డ్ టెండర్లు ఆహ్వానిస్తున్నట్లు పేర్కొన్నారు.

సంగీత విభావరి



గీతాలాపన చేస్తున్న రామలింగప్ప

పరిగి: మండలంలోని శాసనకోట వద్ద ఉన్న రుద్రపాదాల వద్ద ఆదివారం సాయంత్రం నుంచి రాత్రి పొద్దుపోయో వరకూ సంగీత విభావరి నిర్వహించారు. గాన గంధర్వ, ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం అభిమాన కళాకారుల సంఘం ఆధ్వర్యంలో చేపట్టిన కార్యక్రమంలో భాగంగా ఎస్పీ బాలు ఆలపించిన పలు గీతాలను కళాకారులు, గాయకులు ఆలపించారు. అనంతరం దత్త జయంతి సందర్భంగా ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్పీబీ అభిమాన సంఘం అధ్యక్షుడు రామలింగప్ప, ఉపాధ్యాయుడు రామలింగప్ప, ప్రభాకర్‌రాజు, నాగభూషణాచారి, లక్ష్మయ్య, చంద్రమోహన్, పల్లా రమేష్, భీమప్ప, కొండప్ప, అశ్వర్థప్ప తదితరులు పాల్గొన్నారు.

సమాధి ధ్వంసం



పావగడ: తిరుమణి పోలీస్ స్టేషన్ పరిధిలోని నాగేనహళ్లి తండాలో ఓ సమాధిని ధ్వంసం చేసిన సంఘటన సోమవారం వెలుగు చూసింది. ఈ సంఘటనపై స్థానిక తహసీల్దార్ వరదరాజు, సీఐ గిరీశ్‌కు బాధితుడు పవన్ కుమార్ నాయక్ ఫిర్యాదు చేశాడు. ఈ సందర్భంగా బాధితుడు పవన్ కుమార్ మాట్లాడుతూ.. 2017లో గ్రామంలోని ప్రభుత్వ భూమిలో తండ్రి మృతదేహాన్ని పూడ్చి సమాధి చేశామన్నారు. అయితే తాను గ్రామంలో లేని సమయంలో ఓ వ్యక్తి తండ్రి సమాధిని ధ్వంసం చేశాడని తెలిపాడు. సమాధి రాళ్లను తొలగించాడని ఆరోపించాడు. ఇదే గ్రామానికి చెందిన బావన్న.. తండ్రి మృతదేహాన్ని పూడ్చిన స్థలంపై గొడవ పడేవాడన్నారు. సమాధిని కూడా బావన్న ధ్వంసం చేసి ఉండొచ్చని అనుమానం వ్యక్తం చేశాడు. ఈ ఘటనపై విచారణ జరిపి తనకు న్యాయం చేయాలన్నారు.

బహుమతుల ప్రదానం

పెనుకొండ: పట్టణంలోని బాబయ్య దర్గా ఉరుసు సందర్భంగా నిర్వహించిన క్రికెట్, ఖోఖో, టెన్నిస్, లాంగ్‌జంప్,హైజంప్ క్రీడా విజేతలకు సోమవారం బహుమతులు ప్రదానం చేశారు. బాబయ్య దర్గా పీఠాధిపతి తాజ్‌బాబా కుమారుడు కసుబు నజర్ హుసేని మత పెద్దలతో కలసి బహుమతులు అందించారు. అధ్యాపకులు మూర్తి తదితరులు పాల్గొన్నారు.

సుస్థిరాభివృద్ధికి ప్రగతే ఆధారం

పరిగి: సుస్థిర గ్రామాభివృద్ధికి ప్రగతే మూలాధారమని ఎంపీడీఓ శ్రీధర్ తెలిపారు. సోమవారం ఎంపీడీఓ కార్యాలయంలో రెండో విడత శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈసందర్భంగా అధికారులు మాట్లాడుతూ ప్రజలకు, ప్రభుత్వానికి మధ్యవర్తిగా ఉన్న అధికార యంత్రాంగం అత్యంత పారదర్శకంగా వ్యవహరించాల్సిన అవసరముందన్నారు.

ఘనంగా కనకదాస జయంతి



బీదానిపపల్లిలో కలశాలు మోస్తున్న మహిళలు, పాల్గొన్న మంత్రి

రొద్దం: మండలంలోని బీదానిపల్లి గ్రామంలో సోమవారం కురుబల ఆరాధ్యదైవమైన భక్త కనకదాస జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. కనకదాస విగ్రహానికి మహిళలు కలశాలతో ప్రదర్శన చేసి మొక్కులు తీర్చుకున్నారు. రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవితమ్మ గ్రామ మహిళలతో కలసి కలశం మోశారు. కనకదాస చిత్ర పటానికి వీధుల్లో ఊరేగించారు. ఎలాంటి సంఘటన జరగకుండా పోలీసులు బందోబస్త్ నిర్వహించారు. కార్యక్రమంలో కురుబ సంఘం నాయకులు, కురులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

ఆహో ఏమి రుచి.. తినరా మైమరచి..

- జాతీయ రహదారుల వెంబడి ఫుడ్ ట్రక్‌లు
- సరసమైన ధరలో గ్రామీణ భోజనం
- ఎగబడుతున్న వాహనదారులు



44 వ నెంబరు జాతీయ రహదారి ఆంధ్ర సరిహద్దులో వెలసిన ఫుడ్ ట్రక్



అక్కడే అల్పాహారం తయారు చేస్తున్న దృశ్యం

చిలమత్తూరు: సుదూర ప్రాంతాల నుంచి ప్రయాణాలు సాగించే వారిని దృష్టిలో పెట్టుకుని జాతీయ రహదారి వెంబడి కొలువుదీరిన ఫుడ్ ట్రక్‌లకు ఆదరణ పెరుగుతోంది. ఫాస్ట్ ఫుడ్-జంక్‌ఫుడ్ వంటి వాటితో విసిగిపోయిన పట్టణ/ నగర వాసులకు సంప్రదాయబద్ధమైన గ్రామీణ ఆహారాన్ని తెగ ఇష్టపడుతున్నారు. వారి అభిరుచులకు తగ్గట్టుగా ఫుడ్ ట్రక్ నిర్వాహకులు అల్పాహారం, భోజనం, చిరుతిండ్లను అందుబాటులోకి తెస్తున్నారు. పేద, మధ్య తరగతి కుటుంబాలకు చెందిన పలువురితో పాటు విద్యావంతులు సైతం జాతీయ రహదారులపై ఫుడ్ ట్రక్ ద్వారా జీవనోపాధి పొందుతున్నారు. ఎందరు పోటీ ఉన్నా ఎవరి రుచి వారిదే అన్నట్టుగా వ్యాపారాలు సాగుతున్నాయి.

అల్పాహారం వరకే..

చిలమత్తూరు మండల పరిధిలోని 44వ జాతీయ రహదారి వెంబడి పదుల సంఖ్యలో ఫుడ్ ట్రక్‌లు కనిపిస్తాయి. మినీ వాహనాన్ని ట్రక్‌గా మార్చుకుని అందులో కిచెన్‌ను డిజైన్ చేసి.. అప్పటికప్పుడు కళ్లముందే శుచి, శుభ్రతతో ఆహారం తయారు చేస్తారు. ఉదయం 7 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు వ్యాపారం చేసుకుంటున్నారు. అల్పాహారం ఇళ్ల వద్ద చేసుకోవడం మొదలు, దోసె, ఇడ్లీ, పులావ్, వేరుశనగ చెట్నీ, సీజనల్ వంటలు, కంది, అలసందలు తదితర గింజలతో రుచికరమైన కూరలు చేసి అందిస్తున్నారు. నగర/ పట్టణ ప్రాంతాలతో పోలిస్తే ఫుడ్ ట్రక్ వద్ద ధరలు సామాన్యులకు సైతం అందుబాటులో ఉంటున్నాయి. దీంతో వాహనదారులు, ప్రయాణికులతో పాటు స్థానికులు సైతం అలా సరదాగా వచ్చి వంటల రుచిని ఆస్వాదిస్తున్నారు.

ఆదాయం అదుర్స్

ఫుడ్ ట్రక్‌లు నిర్వహిస్తున్న వారికి ఖర్చులు పోను రూ. 3 వేల నుంచి రూ.7వేల వరకు వ్యాపారం జరుగుతోంది. వీటిపై ఆసక్తి పెంచుకొని మరికొన్ని ఫుడ్‌ట్రక్‌లు ఏర్పాటు అవుతున్నాయి. అయినా తగినంత సంపాదన వస్తుండటంతో వ్యాపారాలు సజావుగా సాగిస్తున్నారు.

ధర తక్కువ.. నాణ్యత ఎక్కువ



జాతీయరహదారి-44పై ఫుడ్ ట్రక్ నడుపుతున్నా. రోజువారి వ్యాపారం రూ. 3 వేల నుంచి రూ. 4 వేల వరకు అవుతోంది. మా కుటుంబ జీవనానికి ఎటువంటి ఢోకా లేదు. స్ట్రీట్ ఫుడ్ అయినప్పటికీ నాణ్యతలో ఎక్కడా రాజీ పడకుండా మంచి అల్పాహారం అందిస్తున్నాం. నాసిరకం వస్తువులు కానీ, ఆయిల్ కానీ వాడకుండా అన్నీ నాణ్యమైనవే వాడుతున్నాం. ధరలు కూడా ఈ ప్రాంతానికి తగ్గట్టుగా తీసుకుంటున్నాం. – నాగభూషణరెడ్డి, దేమకేతేపల్లి

ఆలయ నిర్మాణానికి విరాళం



ఆలయ నిర్మాణానికి విరాళం అందిస్తున్న దాత

హిందూపురం: పట్టణంలోని గాంధీ సర్కిల్ వద్ద లక్ష్మీనరసింహస్వామి ఆలయ నిర్మాణానికి డాక్టర్ శ్రీవాణి ప్రసాద్ రూ.2,01,116 విరాళం ప్రకటించారు. ఈ మేరకు ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులకు అందించారు. విరాళాన్ని స్వీకరించిన కమిటీ సభ్యులు దాతకు ఫౌండర్ కమిటీ శాశ్వత సభ్యత్వం ఇస్తున్నట్లు తెలియజేశారు. కార్యక్రమంలో ఆలయకమిటీ సభ్యులు వెంకటస్వామి, రాఘవేంద్ర తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్ప గ్రామోత్సవం

లేపాక్షి: మండల కేంద్రంలోని అయ్యప్పస్వామి గ్రామోత్సవం వైభవంగా జరిగింది. ఆంజనేయస్వామి దేవాలయ సమీపంలోని అయ్యప్ప స్వామిని సోమవారం రాత్రి ప్రత్యేక రథంలో కొలువుదీర్చి దేవాలయం నుంచి బస్టాండ్, ఎగువ పేట, మెయిన్ బజార్ గుండా ఊరేగించారు. గురుస్వామి శ్రీనివాసులు ఆధ్వర్యంలో నగర సంకీర్తనలు, భజనలు చేసుకుంటూ ముందుకు సాగారు. భక్తులకు అన్నదానం చేశారు.

భక్తిశ్రద్ధలతో అయ్యప్ప పడిపూజ

పావగడ: స్థానిక యోగి వీర నారాయణ స్వామి ఆలయంలో సోమవారం రాత్రి అయ్యప్ప స్వాముల పడిపూజను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. శబరిమలైలో ఏర్పాటు చేసిన విధంగా అయ్యప్ప మెట్లను అలంకరించారు. పావగడ నుంచే కాకుండా చుట్టుపక్కల ఆంధ్ర ప్రాంతాల నుంచి సైతం వందలాది మంది అయ్యప్ప స్వాములు తరలివచ్చి పడిపూజలో పాల్గొన్నారు. అయ్యప్ప స్వాములు ఆలపించిన భక్తిగీతాలు ఆకట్టుకున్నాయి.

డ్రైవర్‌పై కేసు నమోదు

రొళ్ల: మండల పరిధిలోని హొట్టేబెట్ట వద్ద ఈనెల 13వ తేదీ సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో హెచ్ఎం వెంకటరామిరెడ్డి తీవ్రంగా గాయపడిన విషయం తెలిసిందే. హెచ్ఎం కుమార్తె భవ్యశ్రీ ఫిర్యాదు మేరకు ప్రమాదానికి కారణమైన డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు ఇన్‌చార్జ్ ఎస్ఐ బాలాజీ తెలిపారు. వివరాలు ఇలా.. రొళ్ల మండలం హెచ్‌టీ హళ్లి ప్రాథమిక పాఠశాలలో వెంకటరామిరెడ్డి హెచ్ఎంగా విధులు నిర్వహిస్తున్నారు. ఈనెల 13వ తేదీన సాయంత్రం విధులు ముగించుకుని ద్విచక్ర వాహనంలో చెన్నేకొత్తపల్లిలోని ఇంటికి బయలుదేరారు. మార్గంమధ్యలోని హొట్టేబెట్ట వద్ద కావేరి ప్రైవేట్ వాటర్ ట్యాంకర్ వెనుక భాగం నుంచి వచ్చి ఢీకొట్టింది. ఈ ఘటనలో హెచ్ఎం వెంకటరామిరెడ్డి కుడి కాలు విరిగింది. తల, ముఖానికి తీవ్ర గాయాలయ్యాయి. కుటుంబ సభ్యులు హెచ్ఎంను చికిత్స నిమిత్తం బెంగళూరుకు తరలించారు. వాటర్ ట్యాంకర్ డ్రైవర్ శివరాజ్ అజాగ్రత్తగా వాహనం నడిపి ప్రమాదానికి కారణమైనట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. హెచ్ఎం కుమార్తె భవ్యశ్రీ ఫిర్యాదు కేసు నమోదు చేసుకుని డ్రైవర్‌ను అరెస్ట్ చేశారు.

పార్టీ బలోపేతానికి మరింత కృషి చేయండి



బూత్ కమిటీ సభ్యులతో వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉష శ్రీ చరణ్

పెనుకొండ రూరల్: వైఎస్సార్‌సీపీ బలోపేతానికి మరింతగా కృషి చేయాలని జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీ చరణ్ పిలుపునిచ్చారు. సోమవారం నగర పంచాయతీ పరిధిలోని ఇస్లాపురం, తిమ్మాపురం వార్డులలో జిల్లా అధ్యక్షురాలు పర్యటించారు. అనంతరం కార్యకర్తలతో సమావేశం ఏర్పాటు చేశారు. అనంతరం వార్డు కమిటీలను ఏర్పాటు చేశారు. తిమ్మపురం వార్డు కమిటీ అధ్యక్షుడిగా పి.గంగన్న, యూత్ అధ్యక్షుడిగా వి.శీనా, రైతు విభాగం అధ్యక్షుడిగా ఆంజనేయులు, అధ్యక్షురాలుగా విజయ, బూత్ కమిటీ జమన్, ఎస్సీ సెల్ పి.వెంకటేష్, బీసీ సెల్ బి.ఓబిలేష్, సోషల్ మీడియా మహబూబ్ బాషా, వి.శేషాద్రి. మైనార్టీ సెల్ ఎస్.షేక్షావలిని ఎంపిక చేశారు.

ఇస్లాపురం వార్డు కమిటీ..

వార్డు అధ్యక్షుడు జి.ఆంజనేయులు, రైతు విభాగం ఎ.తిమ్మారెడ్డి, బూత్ కమిటీ ముత్యాలప్ప, బీసీ సెల్ జి.నారాయణ, విద్యార్థి విభాగం వి.వెంకటేష్, సోషల్ మీడియా జి.మనోహర్, యూత్ అధ్యక్షులు సీఎస్ నాగరాజు, మహిళా విభాగం వి.వరాలమ్మ, ఎస్సీ సెల్ హెచ్. నర సింహులును నియమించారు. కార్యక్రమంలో వాల్మీకి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పొగాకు రామచంద్ర, టౌన్ కన్వీనర్ నరసింహ, నాయకులు శ్రీకాంత్ రెడ్డి, యాసిన్, రాము, ఆంజనేయులు, తిమ్మారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కెనరా బ్యాంక్ గోల్డెన్ జూబ్లీ వేడుకలు



మాట్లాడుతున్న కెనరా బ్యాంక్ రీజినల్ మేనేజర్ లారెన్స్

అమరాపురం: కెనరా బ్యాంక్ అందిస్తున్న సేవలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఆ బ్యాంకు రీజినల్ మేనేజర్ లారెన్స్, ఎంపీడీఓ రామరావు, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి, సర్పంచ్ వాగేష్ పేర్కొన్నారు. సోమవారం స్థానిక వీరశైవ కళ్యాణ మంటపంలో కెనరా బ్యాంక్ గోల్డెన్ జూబ్లీ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్ఎం మాట్లాడుతూ కెనరా బ్యాంకు ఏర్పడి 50 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా వేడుకలను ఘనంగా నిర్వహిస్తున్నామన్నారు. అమరాపురంలో కేవలం 10 మంది ఖాతాదారులతో ప్రారంభమైన బ్యాంకు.. ప్రస్తుతం వేల సంఖ్యలో ఖాతాదారులు ఉన్నారని పేర్కొన్నారు. బ్యాంకు ద్వారా 15 రకాల సేవలను అందిస్తున్నట్లు తెలిపారు. ఎంపీడీఓ రామరావు, సర్పంచ్ వాగేష్ మాట్లాడుతూ.. ఒకప్పుడు బ్యాంకు అంటే ప్రజలు భయపడేవారని.. ప్రస్తుతం బ్యాంకు తలుపు తెరిస్తే ఖాతాదారులతో కళకళలాడుతోందన్నారు. మహిళలు ఖాతాలు తెరచి డబ్బు పొదుపు చేసుకుంటున్నారని తెలిపారు. అనంతరం బ్యాంకు మేనేజర్ ప్రసాద్ బేరా ఆధ్వర్యంలో వివిధ మహిళా సంఘాలకు రుణాలు అందజేశారు.అతిథులను శాలువా, జ్ఞాపికలతో సన్మానించారు.

ఫీజులతో సంబంధం లేకుండా హాల్‌టికెట్లు ఇవ్వాలి



మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు బాబావలి

హిందూపురం టౌన్: కళాశాల ఫీజులతో సంబంధం లేకుండా డిగ్రీ విద్యార్థులకు యాజమాన్యాలు హాల్ టికెట్లు ఇవ్వాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు బాబావలి డిమాండ్ చేశారు. సోమవారం పట్టణంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లా వ్యాప్తంగా డిగ్రీ ఫస్ట్ ఇయర్ విద్యార్థులకు ఫస్ట్ సెమ్ పరీక్షలు ఈ నెల 18న ప్రారంభమవుతాయన్నారు. కళాశాల ఫీజులు చెల్లిస్తేనే హాల్ టికెట్లు ఇస్తామంటూ యాజమాన్యాలు వేధిస్తున్నాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను కళాశాల యాజమాన్యాల ఖాతాల్లోకి వేస్తామని జీఓ ఇచ్చినా విద్యార్థులను ఇబ్బందులకు గురి చేయడం సమంజసం కాదన్నారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్న ప్రైవేట్ డిగ్రీ కళాశాలపైన యూనివర్సిటీ అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు దిలీప్, అజయ్, సురేష్, నరేష్, సాగర్, హరి పాల్గొన్నారు.

కనుల పండువగా కన్నడ రాజ్యోత్సవం



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న దృశ్యం

పావగడ: స్థానిక గురుభవన్ మైదానంలో కర్ణాటక రక్షణ వేదిక (ప్రవీణ్ శెట్టి) నేతృత్వంలో నిర్వహించిన 69వ కన్నడ రాజ్యోత్సవ వేడుకలు సోమవారం సాయంత్రం కనుల పండువగా జరిగాయి. ఈ సందర్భంగా కర్ణాటక రక్షణ వేదిక రాష్ట్ర అధ్యక్షుడు ప్రవీణ్ శెట్టి మాట్లాడుతూ.. ఆంధ్ర సరిహద్దు పావగడలో ప్రపంచంలోనే అతి పెద్ద సోలార్ పార్క్ నిర్మించారన్నారు. అయితే పావగడలో మాత్రం సౌర విద్యుత్ సరఫరా లేదని ఎద్దేవా చేశారు. వెంటనే సోలార్ పార్క్ కంపెనీలు పావగడకు సౌర విద్యుత్ అందించాలని డిమాండ్ చేశారు. లేకపోతే పోరాటాలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో కరవే రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఉమేశ్ గౌడ, పావగడ తాలూకా కరవే అధ్యక్షుడు లక్ష్మీనారాయణ, గౌరవాధ్యక్షుడు పాళేగార్ లోకేశ్, ఉపాధ్యక్షుడు నరసీ పాటిల్, పట్టణ అధ్యక్షుడు నరసింహమూర్తి, గౌరవాధ్యక్షుడు అమీర్, ప్రధాన కార్యదర్శి మూర్తి, రామమూర్తి, మంజు తదితరులు పాల్గొన్నారు.

ప్రణాళిక లేకపోతే అభివృద్ధి శూన్యం



మాట్లాడుతున్న ఎంపీడీఓ యాదవేంద్ర

అగళి: సుస్థిరాభివృద్ధి లక్షాలు సాధించాలంటే ప్రణాళిక ఉండాలి. ప్రణాళిక లేకపోతే అభివృద్ధి శూన్యమని ఎంపీడీఓ యాదవేంద్ర పేర్కొన్నారు. సోమవారం ఎంపీడీఓ కార్యాలయంలో సుస్థిరాభివృద్ధి లక్ష్యాలపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ.. గ్రామాలు సుస్థిరాభివృద్ధి లక్ష్యాలు సాధించేందుకు ఐక్యరాజ్య సమితి 17 అంశాలను నిర్దేశించిందన్నారు. కార్యక్రమంలో డాక్టర్ శివానంద, ఏఓ శేఖర్ నాయక్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లీలావతి, సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

రొళ్ల: మండల ప్రజా పరిషత్ కార్యాలయ ఆవరణలో సోమవారం పంచాయతీ కార్యదర్శులు, సచివాలయం సిబ్బందికి సుస్థిరాభివృద్ధిపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ట్రైనర్లు రచన, నన్నమ్మ, శిరీష, వెంకటేష్ మాట్లాడుతూ.. గ్రామాలను అన్ని విధాలా అభివృద్ధి చేసేందుకు కృషి చేయాలన్నారు. తాగునీటి సమస్య, డ్రైనేజీ వ్యవస్థ, సీసీ రోడ్డు నిర్మాణం, పైప్‌లైన్ ఏర్పాటు సమస్యలు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

గ్రామ సుస్థిర అభివృద్ధిపై శిక్షణ

గోరంట్ల: ఎంపీడీఓ కార్యాలయంలో గ్రామ సుస్థిర అభివృద్ధిపై పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులు, వీఆర్‌ఓలకు ఎంపీడీఓ నరేంద్ర ఆధ్వర్యంలో సోమవారం శిక్షణ తరగతులు ప్రారంభించారు.

రొద్దం: ఎంపీడీఓ కార్యాలయ సమావేశ భవనంలో సుస్థిర అభివృద్ధి – లక్ష్యాలపై సోమవారం శిక్షణ నిర్వహించారు. ఎంపీడీఓ రామ్‌కుమార్, ఈఓఆర్డీ గోవిందప్ప, సర్పంచులు, కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

పెనుకొండ: పట్టణ సమీపంలోని పులేకమ్మ గుడి వద్ద సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో హర్షవర్ధన్ అనే వ్యక్తి గాయపడ్డాడు. సోమందేపల్లి మండలం వెలగమేకలపల్లికి చెందిన హర్షవర్ధన్ వ్యక్తిగత పని నిమిత్తం ద్విచక్ర వాహనంపై పెనుకొండకు వచ్చాడు. అనంతరం తిరిగి సొంతూరుకు వెళ్తుండగా 44వ జాతీయ రహదారిపై గూడ్స్ ఆటో వెనుక వైపు నుంచి బలంగా ఢీకొనింది. దీంతో హర్షవర్ధన్‌కు గాయాలయ్యాయి. అతన్ని పెనుకొండ సర్వజనాస్పత్రికి తరలించి, ప్రాథమిక చికిత్సన అనంతరం మెరుగైన చికిత్స కోసం హిందూపురం ఆస్పత్రికి తరలించారు.

వేతనాలు పెంచాలని గార్మెంట్స్ కార్మికుల ధర్నా

గోరంట్ల: మండల పరిధిలోని గుంతపల్లి సమీపంలో ఉన్న నిషా గార్మెంట్స్ కార్మికులు వేతనాలు పెంచాలని సోమవారం ధర్నా చేశారు. పుట్టపర్తి, గోరంట్ల ప్రధాన రహదారిపై బైఠాయించి, నిరసన తెలియజేశారు. మహిళా కార్మికులు మాట్లాడుతూ యాజమాన్యం కష్టానికి తగిన వేతనం ఇవ్వాలని కోరారు. రోజుకు రూ.350 చొప్పున చెల్లిస్తోందని, అనారోగ్యంతో విధులకు వెళ్లకపోతే రూ.1000 జరిమానా విధిస్తున్నట్లు ఆవేదన వ్యక్తం చేశారు. ఓటీల పేరుతో మహిళలు అని చూడకుండా అధిక పనిభారం మోపుతున్నట్లు ఆవేదన వ్యక్తం చేశారు. స్పందించిన యాజమాన్యం ఆందోళన కారులతో చర్చలు జరిపారు. కార్మికులకు జీతలు పెండానికి చర్యలు తీసుకొంటమని యాజమాన్యం హామీ ఇచ్చింది. దీంతో మహిళా కార్మికులు ఆందోళన విరమించారు.

రేపు ఉద్యోగ మేళా

హిందూపురం: హిందూపురం మహిళా ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఈ నెల 18న జాబ్ మేళా నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ హరీష్ రావు, రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ జిల్లా అధికారి హరికృష్ణ తెలిపారు. పది, ఇంటర్, డిగ్రీ, పీజీ డిప్లొమా, ఐటీఐ పూర్తి చేసి 18 నుంచి 35 ఏళ్లలోపు ఉన్న వారు అర్హులని పేర్కొన్నారు. ఎంపికైన వారు బెంగళూరు, పెనుకొండ, హిందూపురం ప్రాంతాల్లో పని చేయాలని, నెలకు రూ.13 వేల నుంచి రూ.19వేల వరకు వేతనం ఉంటుందని పేర్కొన్నారు. ఇంటర్వ్యూకు హాజరయ్యే అభ్యర్థులు బయోడేటాతో పాటు ఆధార్, విద్యార్హత పత్రాలు తీసుకుని బుధవారం ఉదయం 9గంటలకు హాజరు కావాలని సూచించారు. అభ్యర్థులు https://rb.gy/lpgnqr లింక్‌లో రిజిష్టర్ చేసుకోవాలని, మరిన్ని వివరాలకు 99666 82246 నంబర్‌లో సంప్రదించాలని తెలిపారు.

నేటి నుంచి మొబైల్ ఆధార్ క్యాంపులు

అమరాపురం: మండలంలోని గ్రామ సచివాలయాల పరిధిలో మంగళవారం నుంచి నిర్వహించే మొబైల్ ఆధార్ క్యాంపులను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ రామరావు తెలిపారు. ఈనెల 17న వలస, వి.అగ్రహారం, హేమావతి-1, 2 నిడ్రగట్ట గ్రామ సచివాలయంలో, 18న హాలుకూరు-1, 2 సచివాలయాలు, అమరాపురం-1, 2 సచివాలయాలు, 19న బసవనపల్లి, ఆలదపల్లి, కె.శివరం, 20న మడకశిర, తమ్మడేపల్లి-1 2 గ్రామ సచివాలయాల్లో మొబైల్ ఆధార్ కేంద్రాలు ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. ఆయా గ్రామ సచివాలయాల పరిధిలోని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

పొట్టి శ్రీరాములుకు ఘన నివాళి

హిందూపురం: అమరజీవి పొట్టి శ్రీరాములు వర్ధంతిని పురస్కరించుకుని లయన్స్‌క్లబ్ సభ్యులు సోమవారం కోట ఏరియాలోని పొట్టి శ్రీరాములు ఎలిమెంటరీ స్కూల్‌లో చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం 110 మంది విద్యార్థులకు నోట్ పుస్తకాలు, పెన్నులు, పెన్సిళ్లు, బిస్కెట్లు అందజేశారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అంతర్జాతీయ ఉపాధ్యక్షుడు దాసా సందేశ్, స్థానిక అధ్యక్షుడు రామమూర్తి, మాజీ అధ్యక్షుడు దాసా గంగాధర్, సూర్యనారాయణ, రాజేంద్ర గుప్తా, కిరణ్, ఎస్‌డీజీఎస్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు పాటించకపోతే చర్యలు

గుడిబండ: మండల కేంద్రంలో సోమవారం రాత్రి ఎస్ఐ రాజ కుళ్లాయప్ప, పోలీస్ సిబ్బంది వాహనాల తనిఖీ నిర్వహించారు. హెల్మెట్, సీట్‌బెల్ట్ ధరించని వాహనదారులకు జరిమానా విధించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ.. లైసెన్స్ లేకుండా వాహనాలు నడుపుతున్న వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అక్రమంగా మద్యం, ఇతరత్రా నిషేధిత వస్తువుల సరఫరాను అడ్డుకట్టు వేసేందుకు చర్యలు తీసుకుంటామని ఎఎస్ఐ చంద్రశేఖర్ తెలిపారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ చార్జీల పెంపు తగదు



విద్యుత్ బిల్లులను దహనం చేస్తున్న నాయకులు

పెనుకొండ రూరల్: ఎన్నికల సమయంలో కూటమి నాయకులు ఇచ్చిన హామీకి విరుద్ధంగా విద్యుత్ చార్జీలను పెంచడం సరికాదని అఖిలపక్షంనాయకులు అన్నారు. సోమవారం స్థానిక గాంధీ విగ్రహం వద్ద విద్యుత్ బిల్లులను తగలబెట్టి, నిరసన తెలియజేశారు. కార్యక్రమంలో సీపీఎం సీనియర్ నాయకుడు హరి, సీఐటీయూ జిల్లా కార్యదర్శి రమేష్, సివిల్ సప్లయిస్ హమాలీ యూనియన్ జిల్లా కార్యదర్శి నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

ట్రూఅప్ చార్జీల పేరిట దోపిడీ

చిలమత్తూరు: ట్రూఅప్ చార్జీల పేరిట కూటమి ప్రభుత్వం దోపిడీకి తెర తీసిందని సీపీఎం జిల్లా నాయకుడు ప్రవీణ్‌కుమార్ మండిపడ్డారు. సోమవారం సీపీఎం నాయకులు, రైతులు చిలమత్తూరులో విద్యుత్ బిల్లులను తగలబెట్టారు. ప్రవీణ్ మాట్లాడుతూ కూటమి అదికారంలోకి రాగానే విద్యుత్ వినియోగదారులపై రూ.12 వేల కోట్ల భారం మోపిందని దుయ్యబట్టారు. తక్షణమే ట్రూఅప్ చార్జీల వసూలు ఆపాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి వెంకటేష్, రామచంద్ర, నాగరాజు, రహమ్‌తుల్లా పాల్గొన్నారు.

500 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ ఇవ్వాలి

పెనుకొండ రూరల్: చేనేతలకు ఇచ్చిన హామీ మేరకు 500 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ హామీ పథకాన్ని అమలు చేయాలని హిందూపురానికి చెందిన చౌడేశ్వరి పవర్ లూమ్స్ సెక్రటరీ సుధీర్‌బాబు తదితరులు మంత్రులు కొండపల్లి శ్రీనివాస్, సవితను కోరారు. సోమవారం స్థానిక ఆర్డీవో కార్యాలయంలో, ఎమ్మెస్ఎంఈ, సెర్ప్ ఉద్యోగులతో రివ్యూ ఏర్పాటు చేశారు. జాతీయ రహదారికి అనుకూలంగా బెంగళూరు దగ్గరలో ఉన్న హిందూపురాన్ని ఐటీ సెక్టార్‌గా మార్చాలని, శ్రీసత్య సాయి జిల్లా చాంబర్ ఆఫ్ జిల్లా అధ్యక్షుడు రాంప్రసాద్, ఎంవీఎస్ మూర్తి, బండి కృష్ణమూర్తి తదితరులు కోరారు.

ధర్మవరంలో ఇండస్ట్రియల్ పార్కు ఏర్పాటు చేయండి..

ధర్మవరం పట్టణానికి మహిళా ఇండస్ట్రియల్ పార్కు, కుట్టు పరిశ్రమ ఏర్పాటు చేయాలని మంత్రులు కొండపల్లి శ్రీనివాస్, సవితను ధర్మవరం ఇన్‌చార్జ్ పరిటాల శ్రీరాం కోరారు. అనంతరం మంత్రి శ్రీనివాస్ మాట్లాడుతూ ఎగుమతుల పోర్టల్‌తోపాటు పరిశ్రమల అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించినట్లు తెలిపారు. 175 నియోజక వర్గాలలోనూ పారిశ్రామిక పార్కులు ఏర్పాటు చేస్తామన్నారు. చేనేత కార్మికులకు కేంద్ర,రాష్ట్ర సంక్షేమ పథకాలుపై అవగాహన కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు ఎమ్మెస్ రాజు, సింధూరరెడ్డి, ఏపీఐఐసీ జిల్లా జోనల్ అధికారి సోని సుహాని, అనంతపురం జిల్లా జీఎం శ్రీధర్, డీఆర్‌డీఏ పీడీ నరసయ్య, ఆర్డీవో ఆనంద్ కుమార్, బ్యాంకర్లు పాల్గొన్నారు.